సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 25 । జూలై । 2023



'సాగు' ముమ్మరం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో వివిధ పంటల సాగు పనులు ముమ్మరమయ్యాయి. ఈ సందర్భంగా సస్యరక్షణ చర్యల గురించి కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు. - 8లో



కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$29^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఆర్టీసీ హనుమకొండ డీఎంగా ధరంసింగ్ నాయక్



హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్‌గా బి.ధరంసింగ్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బాబునాయక్ పదోన్నతిపై మహబూబ్‌నగర్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా వెళ్లగా.. ఇక్కడికి నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న ధరంసింగ్ బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన డీఎంను సూపర్‌వైజర్లు చంద్రశేఖర్, సుల్తానా, ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, సజ్జన్‌నాయక్, గౌస్ పాషా, పాపారావు, ఉమామహేశ్వర్, బీఎస్ చారి, ఖలీల్, అనూష తదితరులు కలిసి సన్మానించారు.

'ఇంటింటా ఇన్నోవేటర్' పోస్టర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: గ్రామీణ సృజనాత్మక ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి 'ఇంటింటా ఎన్నోవేటర్' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, వారి ఆవిష్కరణలను సమాజానికి చేరువ చేయడానికి తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) కృషి చేస్తుందని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ అబ్దుల్‌హై అన్నారు. సోమవారం డీఈఓ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి, కార్యాలయ సూపరింటెండెంట్ శైలజ తదితరులతో కలిసి డీఈఓ ఆవిష్కరించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు, వీటి నమోదుకు ఆగస్టు 5 తుది గడువు అని డీఈఓ తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి 94901 12848 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పోస్టింగ్‌ల కోసం 413 మంది వీఆర్‌ఏలు

హన్మకొండ అర్బన్: వీఆర్‌ఏల పే స్కేల్ అమలు చేస్తూ.. ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. జిల్లా అధికారులు ఇందుకు సంబంధించిన లెక్కలు తీస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 413 మంది వీఆర్‌ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఒకరు మరణించినట్లుగా సమాచారం. కాగా.. పదోతరగతి పూర్తయిన వీఆర్‌ఏలకు ఆఫీస్ సబార్డినేట్‌గా, ఇంటర్మీడియెట్ పూర్తయిన వారికి రికార్డు అసిస్టెంట్‌గా, డిగ్రీ పూర్తి చేసిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అదే విధంగా 2011 నవంబర్1 కంటే ముందుగా వీఆర్‌ఏగా నియామకమై ప్రస్తుతం 61 ఏళ్లు పూర్తి చేసుకున్న వారి వారసులకు విద్యార్హతల్ని బట్టి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా స్థాయిలో అధికారులు చేపట్టారు.

ఈస్ట్ జోన్ డీసీపీగా రవీందర్



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీగా పి.రవీందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకాలం ఈస్ట్‌జోన్ డీసీపీగా పనిచేసిన పుల్లా కరుణాకర్ ఇటీవల జరిగిన బదిలీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఒకటి రెండు రోజుల్లో రవీందర్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్ల అనంతరం మిగిలిన సివిల్ ఇంజనీరింగ్ 12, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 47 సీట్ల స్పాట్ అడ్మిషన్‌కు మంగళవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం.. ఈనెల 28న సీట్లు కేటాయించనున్నట్లు వివరించారు. సీటు కోసం అప్లై చేసుకున్న విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు నిర్ణీత ఫీజుతో ఈనెల 28న కళాశాలకు హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు. పాలిసెట్ పరీక్ష ఉత్తీర్ణులైన వారు లేదా పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27లోపు వారి దరఖాస్తులు కళాశాలలో సమర్పించాలని సూచించారు.

పైసల్లేవు.. పనులు సాగవు!

జీడబ్ల్యూఎంసీకి ఆర్థిక ఇబ్బందులు

- రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.25.62కోట్లు.. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.43.92కోట్లు రావాల్సి ఉంది..
- కాంట్రాక్టర్లకు చెల్లించాల్సింది రూ.100కోట్లు
- నిధుల విషయంలో చొరవ చూపని పాలకులు, ఉన్నతాధికారులు
- నగరంలో అభివృద్ధి గాడి తప్పే ప్రమాదం!



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. బల్దియాకు రావాల్సిన నిధులను తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. అస్తవ్యస్త విధానాలతో నిర్వహణ భారమైన పరిస్థితి ఏర్పడింది. ఈకష్టాల నుంచి గట్టెక్కాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి న్యాయబద్ధంగా కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయి నిధులు రాబట్టుకోవడం ఒక్కటే ప్రధాన మార్గం. ఇందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే మరికొద్ది నెలల్లో వరంగల్ మహానగరంలో అభివృద్ధి గాడి తప్పే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది.

స్పష్టమైన ఆదేశాలు..

నిధులతో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలనేది తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా వాహనాల కొనుగోలు, హరితహారంలో భాగంగా పచ్చదనం, ఆట స్థలాలు, ప్రజా మరుగుదొడ్లు, ఆటోస్టాండ్లు, డంపింగ్ యార్డులు, చెత్త శుద్ధీకరణ, భవన నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగానికి సీఎస్‌డీ ప్లాంట్లు, వెండింగ్ జోన్లు, వీధి దీపాలు, ప్రధాన రహదారుల అభివృద్ధి, వరద నీటి కాల్వలు, పుట్‌పాత్‌లు తదితర పనులకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఏడాది కాలంగా ఆగిన నిధులు..

కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను గతేడాదిగా నిలిపేసింది. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ నుంచి నిధులు విడుదల చేయట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.25.62కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.43.92కోట్లు రావాల్సి ఉంది. దీంతో మహానగర పాలక సంస్థ ఆర్థిక స్థితి అగమ్యగోచరంగా మారింది. సాధారణ పన్నుల ద్వారా పరిపాలన నిర్వహణలో జీతాలు, కార్యాలయ, ఇంధనం, తదితర పనులను సరిపెడుతున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులతో ఇతర పనులకు కేటాయించే పరిస్థితి ఏమాత్రం కనిపించట్లేదు. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.100 కోట్ల బకాయిలను జీడబ్ల్యూఎంసీ చెల్లించాల్సి ఉంది. బిల్లులు రాక వారు లబోదిబోమంటున్నారు. నిధుల విషయమై పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులను వివరణ కోరగా.. ప్రభుత్వాల నుంచి విడుదల చేయాల్సి ఉందని, ఈ మేరకు పదే పదే లేఖలు రాస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి నెలా రూ.7.32 కోట్లు..

స్థానిక సంస్థల ఆర్థిక మనుగడకు వీలు కలిగించేలా కొన్ని రకాల పన్నుల్లో నగర పాలక సంస్థలకు ప్రభుత్వాలు వాటాలు కల్పించాయి. అందులో భాగంగా జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీలకు, నగర పాలక సంస్థలకు కేంద్రం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రేటర్ వరంగల్‌కు 2020 ఫిబ్రవరి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.3.66 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి ద్వారా రూ.3.66 కోట్లు విడుదల చేస్తోంది. ఇలా రూ.7.32కోట్లు మంజూరయ్యాయి. వీటితో పాటు ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జీలు, స్టాంపు డ్యూటీ, తదితర పన్నులతో బల్దియా పరిపాలన, ఇతర అభివృద్ధి పనులను కొనసాగిస్తూ ముందుకు సాగుతోంది. కేంద్రం సుమారు 28 నెలల పాటు రూ.102.48కోట్లు విడుదల చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం 34 నెలలు రూ.124.44కోట్లు మంజూరు చేసింది.

నిధులిస్తేనే పనులు..

అభివృద్ధి పనులకు నిధులిస్తేనే చేస్తామని బల్దియా సివిల్ కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు సోమవారం బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వారు కమిషనర్ షేక్ రిజ్వాన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. బిల్లులు విడుదల చేయకపోతే ఆగస్టు 1 నుంచి నగర వ్యాప్తంగా అభివృద్ధి పనులు నిలిపివేసి సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు.

హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డు కేడీసీ ఎదుట ప్రవహిస్తున్న వర్షపు నీరు



నగరంలో దంచికొట్టిన వాన

వరంగల్ అర్బన్/కరీమాబాద్/హన్మకొండ : ఓరుగల్లు నగరాన్ని సోమవారం వరుణుడు ముంచెత్తాడు. ఉదయం నుంచి తుంపర్లతో ఆగుతూ.. సాగుతూ.. ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ప్రధాన రహదారులు సైతం జలమయమయ్యాయి. అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరంతా వీధుల్లోకి చేరింది. హంటర్‌రోడ్డు ఎన్టీఆర్‌నగర్, ఎస్ఆర్ఆర్‌తోట వీరలక్ష్మి కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరింది. బొంది వాగు నాలా ద్వారా వరద ప్రవాహం కొనసాగుతోంది. కాశిబుగ్గ సాయినగర్‌కాలనీ, ఎంహెచ్ఓ కాలనీలు జలమయమయ్యాయి. దేశాయిపేట వీవర్స్‌కాలనీ, ఎంహెచ్‌ఓనగర్, ఉర్సు డీకేనగర్, రాజీవ్ కాలనీల్లో జనం ఇబ్బంది పడ్డారు. హన్మకొండ సమ్మయ్యనగర్, రాజాజీనగర్ ప్రాంతాల్లో వరద నీరు ఎక్కడికక్కడ నిలిచింది. హనుమకొండ జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 నుంచి సోమవారం ఉదయం 8.30 వరకు సగటున 9.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

నేడు, రేపు భారీ వర్షాలు

ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముంది.



వరంగల్ స్టేషన్ రోడ్‌లో..



వరంగల్ రాజేంద్రనగర్ కాలనీలో..

వినతులు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో స్వీకరించిన వినతులను ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మొత్తం 151 అర్జీలు రాగా వాటిని కలెక్టర్ స్వీకరించారు. అందులో ఈడీ ఎస్సీ కార్పొరేషన్‌కు 24, కమిషనర్ జీడబ్ల్యూఎంసీకి 10, తహసీల్దార్ కాజీపేటకు 10, తహసీల్దార్ కమలాపూర్‌కు 9, ఎంజీఎం సూపరింటెండెంట్‌కు 7, మిగతావి ఇతర శాఖలకు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో సమస్య తెలుసుకుంటున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 88 అర్జీలు రాగా ఆమె స్వీకరించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన వినతుల్లో భూసమస్యలకు సంబంధించినవి 30 వరకు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం ఈవీఎం అవగాహన కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. గ్రీవెన్స్‌కు వచ్చే ప్రజలకు ఓటు హక్కు వినియోగం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- బల్దియా గ్రీవెన్స్‌కు 85 అర్జీలు

వరంగల్ అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 85 అర్జీలు రాగా వాటిని కమిషనర్ స్వీకరించారు. అందులో టౌన్‌ప్లానింగ్‌కు 47, ఇంజినీరింగ్ సెక్షన్ 18, పన్నుల విభాగం 11, ప్రజారోగ్యం 8, తాగునీరుపై ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు సమర్థవంతంగా పనిచేశారని, మరో ఐదు రోజులు భారీ వర్ష సూచనలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, సిబ్బంది తమ కుటుంబ సభ్యులను సైతం భాగస్వాములను చేయాలన్నారు. అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, ఇన్‌చార్జ్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఆర్ఎఫ్ఓ పాపయ్య, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, సీఎంహెచ్ఓ రాజేష్, సీహెచ్ఓ శ్రీనివాసరావు, డీఎఫ్ఓ శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, జోనా పాల్గొన్నారు.



గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

అర్జీల్లోని వివరాలు..

- 15వ డివిజన్ కట్టమల్లన్న గుడి నుంచి గొర్రెకుంటకు వెళ్లే దారిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ముగ్గురు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు. ప్రమాదాలను నివారించాలని సిలువేరు రవీందర్ కోరారు.
- 43వ డివిజన్ గణేష్‌నగర్‌లో అంతర్గత సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- 12వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో రోడ్డు అధ్వానంగా తయారైందని, సీసీ రోడ్డు నిర్మించాలని బాలాజీనగర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు అర్జీ సమర్పించారు.
- ఏనుమాముల బాలాజీనగర్‌లో 150 ఇళ్లు ఉన్నాయని, సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు విన్నవించారు.
- 1వ డివిజన్ శ్రీనివాస్‌కాలనీ ఎర్రగట్టుగుట్ట వద్ద సీసీ రోడ్డు దెబ్బతిని మురుగునీరు రోడ్డుపై పారుతోందని, మరమ్మతు చేయించాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు.
- 10వ డివిజన్ పద్మాక్షికాలనీ, రాజ్‌పుత్‌కాలనీ, కాపువాడ ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుతోందని, సీసీ రోడ్డు వేయాలని కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు.
- పద్మాక్షి కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని, ఇందుకు స్థానిక ఎమ్మెల్యే రూ.35లక్షలు మంజూరు చేశారని కాలనీవాసులు కోరారు.
- ప్రశాంత్‌నగర్ రోడ్డు-4లో ఓ వ్యక్తి బల్దియా వేసిన రోడ్డు తనదిగా పేర్కొంటూ ప్రహరీ నిర్మించాడని, చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.
- నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని, ఇటీవల ఆర్థిక భారంతో మానసికంగా కృంగిపోయి ఇద్దరు కాంట్రాక్టర్లు మృతి చెందారని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మోడ్రన్ అవేర్‌నెస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు లైలా

హన్మకొండ/హన్మకొండ అర్బన్: ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని మోడ్రన్ అవేర్‌నెస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు లైలా కోరారు. ఈ మేరకు ట్రాన్స్‌జెండర్లు ప్రదర్శనగా సోమవారం హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లైలా మాట్లాడుతూ వరంగల్‌లో నివసిస్తున్న తమకు కుటుంబాల నుంచి ఎలాంటి సపోర్టు లేదని, సమాజంలో అవమానాలు తప్ప ఆదరణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. భిక్షాటన ఒక్కటే మార్గమైందని, అణగారిన వర్గాలకు, వెనుకబడిన కులాలకు, అభాగ్యులకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం.. ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా పథకాలు అమలు చేయాలని కోరారు. తమకు ఆసరా పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడంతోపాటు ప్రత్యేక ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయాలని కోరారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్‌లు అశ్విని, సుధ, ప్రియాంక, వీణ, స్నేహ, మేఘన, అంజు, సుప్రజ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్ మిషన్ల ప్రదర్శన కేంద్రాన్ని సందరించారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ట్రాన్స్‌జెండర్లు



రైలెక్కిన బస్సులు

కాజీపేట జంక్షన్‌లో సోమవారం బస్సులను తరలిస్తున్న గూడ్స్ రైలు కొద్ది సేపు ఆగింది. సికింద్రాబాద్ నుంచి హిమాచల్ ప్రదేశ్‌కు ఆ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన వివిధ రంగుల్లో ఉన్న సుమారు 50 బస్సులు గూడ్స్ రైలులో ఉన్నాయి. వాటిని ఇతర రైళ్లలో ప్రయాణిస్తున్న వారు ఆసక్తిగా తిలకించారు. - కాజీపేట రూరల్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్



టీఎన్జీఓస్ నాయకులకు వినతిపత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్‌లోని టీఎన్జీఓస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయించేందుకు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం కృషి చేస్తోందని, సమాన పనికి సమాన వేతనం లభించేలా, మహిళా ఉద్యోగులకు సంబంధించిన మెటర్నిటీ లీవ్ కూడా ఇప్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి రాజేశ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు సూర్యకిరణ్, వెంకటేశ్, మహేశ్, ప్రేమ్‌కుమార్, సురేశ్, రమ్య, వినయ్, శాంత, శ్రీధర్, తిరుపతి పాల్గొన్నారు.

ఓటింగ్ మిషన్‌పై అవగాహన

హన్మకొండ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఓటర్లకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ.. జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న జిల్లా వాసులకు సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన వారు ఈప్రదర్శన కేంద్రానికి చేరుకుని సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

'తొలిమెట్టు-2'ను విజయవంతం చేయండి

- డీఈఓ ఎండీ అబ్దుల్ హై
- రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ

విద్యారణ్యపురి: ఈవిద్యా సంవత్సరంలో తొలిమెట్టును విజయవంతం చేయాలని హనుమకొండ డీఈఓ డాక్టర్ ఎండీ అబ్దుల్‌హై కోరారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచడానికి ప్రతీ మండలం నుంచి ఎంపిక చేసిన జిల్లా రిసోర్స్‌పర్సన్లకు సోమవారం హనుమకొండ మండలం సెయింట్ పీటర్స్ పాఠశాలలో శిక్షణను అబ్దుల్‌హై ప్రారంభించి మాట్లాడారు. మూడ్రోజులు జరిగే ఈశిక్షణలో స్టేట్ రిసోర్స్ గ్రూప్ టీచర్లు, జిల్లా రిసోర్స్ గ్రూపు టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో 14 ఎంపిక చేసిన మండలాల నుంచి ప్రతీ మండలానికి ఆరుగురు ఉపాధ్యాయుల చొప్పున మొత్తం 84 మంది రిసోర్స్ టీచర్లకు ఈశిక్షణ కొనసాగనుంది. తెలుగు, గణితం, ఆంగ్లంలో మూడు సబ్జెక్టులకు వేర్వేరుగా శిక్షణ కొనసాగుతుంది. కార్యక్రమంలో జిల్లా గుణాత్మక విద్య కో-ఆర్డినేటర్ ఏ.శ్రీనివాస్, కమ్యునిటీ మొబిలైజేషన్ అధికారి బి.రాధ, కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న లష్కర్ బజార్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, ప్రముఖ విద్యావేత్త నారాయణరెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు రిసోర్స్ గ్రూపు టీచర్లు పవన్‌కుమార్, చంద్రయ్య, శ్రీనివాస్, శ్రీధర్, సుమన్ బాబు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ

హనుమకొండ సెయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ తొలిమెట్టు శిక్షణ కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. శిక్షణలో ఉపాధ్యాయులు ఏ అంశాలపై దృష్టిపెట్టాలో.. అలాగే తరగతి గదిలో ఉపాధ్యాయుల పాత్ర ఎలా ఉండాలో ఆయన తెలిపారు.

దళితబంధు-2 దరఖాస్తులకు ప్రత్యేక సెల్

కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో దళితబంధు-2 పథకానికి దరఖాస్తులు అందించేందుకు సోమవారం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హనుమకొండ కలెక్టర్ ఆదేశం మేరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్లలోని ఎస్సీ కమ్యునిటీకి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. దళితబంధు-2 పథకాన్ని పొందేందుకు దరఖాస్తు, ఆధార్‌కార్డ్, కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్లను జత చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ఆయావర్గాలు వినియోగించుకోవాలని కోరారు.



బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన దళితబంధు-2 ప్రత్యేక సెల్

హెచ్‌పీ ఫిల్లింగ్ స్టేషన్‌లో కల్తీ పెట్రోల్



వరంగల్ అర్బన్: వరంగల్ హంటర్ రోడ్డులోని హెచ్‌పీ ఫిల్లింగ్ స్టేషన్‌లో సోమవారం ఓ వినియోగదారుడిని నిలువునా ముంచారు. వరంగల్‌లోని ఓ పీహెచ్‌సీలో వైద్యుడిగా విధులు నిర్వర్తిస్తున్న భరత్ కుమార్ ఫిల్లింగ్ స్టేషన్‌లో 15 లీటర్ల పెట్రోల్ పోయించుకున్నాడు. కిలోమీటర్ వెళ్లిన అనంతరం కారు మొరాయించింది. వెంటనే మెకానిక్‌ను సంప్రదించగా ఆయన.. నీరు నింపిన పెట్రోల్ పోసినట్లు నిర్ధారించాడు. వెంటనే సదరు వైద్యుడు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైద్యుడే కాకుండా మరో 100 లీటర్ల వరకు నీరు కలిగిన పెట్రోల్ పోసినట్లు సమాచారం. సదరు ఫిల్లింగ్ స్టేషన్ యజమాని వై ద్యుడితో తన ఫిర్యాదును వెనక్కితీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఉద్యోగాల పేరిట మోసం...



హసన్‌పర్తి: ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ ఘనుడు ఘనారా మోసానికి పాల్పడ్డాడు. డబ్బు ఇచ్చి రెండేళ్లు అవుతున్నా ఇటు ఉద్యోగం...అటు డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. గోపాలపురానికి చెందిన మాతంగి సురేందర్ నిరుద్యోగి. కరీంనగర్ జిల్లా రాయికల్‌కు చెందిన శివానాధుని రాజేష్ గోపాలపురంలో ఉంటున్నాడు. రూ.2లక్షలు ఇస్తే జేఎన్టీయూలో ఉద్యోగం ఇప్పిస్తానని సురేందర్‌ను నమ్మించాడు. దీంతో సురేందర్‌తో పాటు గోపాలపురం, భీమారం, కోమటిపల్లి, జవహర్‌కాలనీలకు చెందిన 24 మంది రూ.2లక్షల చొప్పున రూ.48 లక్షలు రాజేష్‌కు ఇచ్చారు. అనంతరం నిరుద్యోగుల నుంచి తప్పించుకోవడం ప్రారంభించాడు. మోసపోయానని గ్రహించిన సురేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడు రాజేష్‌ను అరెస్ట్ చేసి ల్యాబ్‌టాప్,మొబైల్ ఫోన్‌స్వాధీనం చేసుకున్నట్లు కేయూ సీఐ అబ్బయ్య తెలిపారు.

ఏడుగురికి జైలు

కాజీపేట: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఏడుగురికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చారు. స్థానిక సీఐ కె.సుజాత కథనం ప్రకారం పట్టణంలోని నిందితులు గాదం మల్లేశం, రచ్చమల్ల శ్రీకాంత్, సిరికొండ దేవేంద్రచారి, గుంజ రాజు, పులుగు విద్యాసాగర్ రెడ్డి, చిన్నాల అయిలయ్య, సరిమెత నవీన్‌కు రెండు రోజుల జైలుశిక్ష, 19మందికి రూ.34,100 జరిమానా విధించినట్లు చెప్పారు.

'సాగు'ముమ్మరం..

విస్తారంగా వర్షాలు

- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- పంటల్లో చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తల సూచనలు





మానుకోట మండలంలో సాగులో ఉన్న పత్తి చేను

మహబూబాబాద్ రూరల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కొంత ఆలస్యమైనా ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్త ఎన్.కిషోర్‌కుమార్.. రైతులకు సూచనలు తెలిపారు.

మిరప..

- ప్రస్తుతం మిరప నారుమడి దశలో ఉంది.
- ఈ వర్షాల వల్ల నారుమడిలో నారుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది.
- నివారణకుగాను మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- విత్తనం ఒత్తుగా విత్తొద్దు. నారుకుళ్లు కనిపించిన వెంటనే తడులను ఆపాలి.

పత్తి..

- సాధ్యమైనంత మేరకు పొలంలో నీరు నిల్వకుండా చూడాలి.
- నీరు నిల్వ ఉంటే కాలువలు ఏర్పాటుచేసి బయటకు పంపించాలి.
- వర్షాలు తగ్గిన తరువాత అదును చూసుకుని వీలైనంత త్వరగా అంతరకృషి (పాటు) చేయాలి
- దీని వల్ల భూమిలో తేమ తగ్గడం, వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి.
- భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి.
- దీనివల్ల పెరుగుదల తగ్గుతుంది. ఈ నేపథ్యంలో పైరుపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి.
- దీని నివారణకుగాను కాపర్‌ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజం 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

వరినాట్లు..

- వరి ప్రస్తుతం నారుమడి దశలో ఉంది.
- నారు తీయడానికి ఏడురోజుల ముందు సెంట్ నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరుంచి వేయాలి.
- ప్రధాన పొలంలో వచ్చే ఉల్లికోడు ఉధృతిని, కాండం తొలుచు పురుగు ఉధృతి అరికట్టొచ్చు.
- నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటే మునా త్వరగా తిరుగుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించుకోవాలి.
- నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపుచేయొచ్చు.
- ఈ గాలిబాటలు ఎరువులు చల్లడానికి, సస్యరక్షణ మందులు పిచికారీ చేసేటప్పుడు వెసులుబాటుగా ఉంటాయి.
- మొత్తం భాస్వరం ఎరువు దమ్ములోనే వేయాలి.
- పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి.
- తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం అంకురం ఏర్పడే దశలో సగం వేయాలి.
- ఆఖరి దమ్ములో 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
- రైతులు నారు పోసుకోవాలంటే స్వల్పకాలిక రకాలను వేసుకోవచ్చు.లేదా దమ్ము చేసిన పొలంలో వరిని నేరుగా విత్తే పద్ధతి ద్వారా, వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్ ద్వారా వేసుకోవాలి.
- ఈ పద్ధతిలో కాండం ధృడంగా ఉండే రకాలు ఎన్నుకుంటే బాగుంటుంది.

ఆరుతడి పంటలు..

- మిగతా ఏ పంటలలోనైనా నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా చూడాలి.
- వర్షాలు తగ్గిన తరువాత, అదునుచూసి అంతరకృషి చేయాలి.
- వేరుకుళ్లులాంటి తెగులు ఆశిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

కేయూలో ప్రొఫెసర్ క్వార్టర్‌లో చోరీ



తలుపులు పగులగొట్టిన దుండగులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ క్వార్టర్‌లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. ఆంగ్ల విభాగంలోఅసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు ని ర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రేణుక.. ప్రొఫెసర్ క్వార్టర్ -2(పీ2)లో ఉంటున్నారు. క్వార్టర్‌కు తాళం వేసి ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడే కొద్దిరోజులుగా ఉన్నా రు. ఈ క్రమంలో క్వార్టర్ తలుపులు పగలగొట్టి ఉ న్నాయనే సమాచారం మేరకు రేణుక తన భర్తతో క లిసి హైదరాబాద్ నుంచి యూనివర్సిటీకి వచ్చారు. వెంటనే కేయూ సెక్యూరిటీ ఆఫీసర్, కేయూ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఎస్సై వచ్చి వివరాలు సేకరించారు. బీరువాలు తెరిచి సామన్లు చిందరవందర చేశారని, ఇతర విలువైన డాక్యుమెంట్లు కనపడటంలేదని పోలీసుకు ఫిర్యాదు చేశారు.

మెడికల్ షాపులో..

- రూ.15వేల నగదు అపహరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఆక్సిజన్ మెడికల్ షాపులో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. రఘునాథపల్లికి చెందిన బైరగోని నవీన్ అండర్‌పాస్ వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాపు షెట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఉదయం షాపు తెరిచేందుకు రాగా షెట్టర్ తాళాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి షాపు వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 15వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్ క్యాష్ కౌంటర్ , తాళాలపై వేలి ముద్రలు సేకరించారు. బా ధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే, ఓ సెల్ షాపులో దుండగులు చోరీకి యత్నించగా షెట్టర్ లాక్ తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు.

కౌలు డబ్బులు అడిగిన అన్నపై తమ్ముళ్ల దాడి

ఖిలా వరంగల్: తన పంటపొలం కౌలు డబ్బులు ఇవ్వాలని అడగగా సొంత అన్నపై తమ్ముళ్లు దూర్భాషలాడుతూ దాడికి తెగపడ్డారు. ఈఘటన ఖిలా వరంగల్ తూర్పుకోటలో సోమవారం జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం తూర్పు కోటకు చెందిన నాంద్రే రాఘవులు (65)కు తూర్పు కోట శివారులో రెండు ఎకరాల పంటపొలం ఉంది. తన సోదరులు నాంద్రే రాజు, నాంద్ర వెంకటేశ్వర్లు ఇరువురికి ఆ భూమిని రాఘవులు కౌలుకు ఇచ్చాడు. చేతికి పంట వచ్చిన తర్వాత కౌలు డబ్బులు తమ అన్నకు ఇవ్వకుండా తమ్ముళ్లు గత కాలంగా అతనిపై దుర్భాషలాడుతూ ఇంటిపై రాళ్లు వేసి దాడికి తెగబడ్డారు. దాంతో బాధితుడు రాఘవులు ఫిర్యాదు మేరకు రాజు, వెంకటేశ్వర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో కొండముచ్చు హల్‌చల్

కాశిబుగ్గ: వరంగల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం ఓ కొండముచ్చు హల్‌చల్ చేసింది. టికెట్ బుకింగ్ కౌంటర్‌లోకి చొరబడడంతో సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. చాలాసేపు అక్కడే కూర్చుని ఉండడంతో ప్రయాణికులకు టికెట్లు ఇవ్వడానికి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా.. కొందరు కొండముచ్చును పట్టుకునేందుకు యత్నించగా.. వరంగల్ బస్టాండ్‌లోకి చొరబడి ప్రయాణికుల్ని భయభ్రాంతులకు గురిచేసింది. కొద్ది సేపటి తర్వాత కొండముచ్చును వారు పట్టుకుని వెళ్లిపోయారు. ఈవీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

రాజేష్ కన్నా సేవలు మరువలేనివి..

- టీపీయూఎస్ రెండు జిల్లాల బాధ్యులు



రాజేష్‌కన్నా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీయూఎస్ బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) హనుమకొండ జిల్లా పూర్వ అధ్యక్షుడు కొల్లూరు రాజేష్‌కన్నా సేవలు మరలేనివని టీపీయూఎస్ రెండు జిల్లాల బాధ్యులు అన్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొల్లూరు రాజేష్‌కన్నా సోమవారం ఉదయం హనుమకొండలోని తన నివాసంలో మృతి చెందారు. కాగా, రాజేష్ కన్నా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా, ఆత్మకూరు, హసన్‌పర్తి మండలాల అధ్యక్షుడిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగాను సేవలు అందించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. టీపీయూఎస్ హనుమకొండ ,వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, బత్తిని వెంకటరమణ, బద్దిని వీరస్వామి, ఉప్పుల సతీష్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆ సంఘం నాయకులు పిన్నింటి బాలాజీరావు, చిదురాల సుధాకర్, దాస్యం రామానుజస్వామి, మాచర్ల భిక్షపతి.. రాజేష్‌కన్నా మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజేష్‌కన్నా మృతి టీపీయూఎస్‌కు తీరని లోటన్నారు. కాగా, హనుమకొండ ఎంఈవో రాంకిషన్‌రాజు, డీఈవో కార్యాలయం కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్‌బి రాధ కూడా నివాళులర్పించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న సీఐ

ఆత్మకూరు: ఏటీఎంలో చోరీకి యత్నించిన ఘటన సోమవారం తెలవారుజామున మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఇండియా వన్ ఏటీఎంలో నలుగురు దుండగులు చోరీకి యత్నించారు. ఏటీఎంను వెల్డింగ్ మిషన్‌తో తెరిచేందుకు ప్రయత్నించగా సాధ్యపడకపోవడంతో వెనుదిరిగారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీఐ రవిరాజు ఏటీఎంను పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా దుండగులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కమిషనరేట్‌కు పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



వరంగల్ క్రైం: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చూస్తు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ నుంచి ఎల్.ప్రవీణ్‌కుమార్, ఖమ్మం నుంచి ఎస్.రవికుమార్, సిద్దిపేట నుంచి రాజశేఖర్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి నుంచి పులి వెంకట్, ఆదిలాబాద్ నుంచి జి.సతీష్‌కుమార్, జూలూరుపాడు సర్కిల్ నుంచి తాటపాముల సురేష్, ఎస్.చంద్రమోహన్‌ను కమిషనరేట్‌కు బదిలీ చేస్తే ఉత్తర్వులు వెలువడ్డాయి.

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై చర్చిస్తున్న చీఫ్‌విప్ దాస్యం, ఎమ్మెల్సీ దేశపతి, 'కుడా' చైర్మన్

హన్మకొండ/వరంగల్ కల్చరల్: కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులపై సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ ఆధ్వరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర, భాషా, సాంస్కృతిక మండలి సంచాలకుడు మామిడి హరికృష్ణ, 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, డీఈఈ రఘునందన్ రావు, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి, శ్రీనివాస్‌రావు, అశోక్, నిర్మాణ బాధ్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్, దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్ర నిర్మాణంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాళోజీ ప్రాముఖ్యం, విశిష్టత, చరిత్ర తెలిపేలా నిర్మాణ పనుల్లో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కాళోజీ రచనలు, పుస్తకాలు, వస్తువులు ప్రత్యేకంగా పొందుపరచాలని సూచించారు. కాళోజీ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ రూపొందించి ప్రదర్శించాలన్నారు. కాళోజీ విగ్రహం, చిత్ర మాలికలకు ప్రత్యేక స్థానం కేటాయించాలన్నారు. 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ కళాక్షేత్ర నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మాణం ఉండాలన్నారు.

69 కిలోల గంజాయి పట్టివేత

- ఐదుగురు నిందితుల అరెస్టు
- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్, నాగమ్మ శక్తి టీం కాజీపేట వారు 69 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ వెల్లడించారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే బిహార్ బెగుసరాయ్‌కు చెందిన రీనాదేవి(45), మురారి పాశ్వాన్(26), గీతాదేవి(53), సునీతాదేవి(60), సౌరవ్(21) శ్రీకాకులం ఇచ్ఛాపురంలో గంజాయి కొనుగోలు చేసి ప్యాకింగ్ చేశారు. వాటిని ఐదు లగేజ్ బ్యాగులలో నింపి పుణే వెళ్లే రైలు మార్గం ద్వారా వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ముంబై రైలు కోసం స్టేషన్‌లో రెండు, మూడవ ప్లాట్‌ఫాం టాయిలెట్ల వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీ చేశారు. బ్యాగుల్లో గంజాయి కనిపించడంతో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.రవిందర్ ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్.ఐలయ్య కేసు నమోదు చేయగా సీఐ నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.13,80,000 ఉంటుందని పేర్కొన్నారు. ఆర్పీఎఫ్ సీఐ టీఎస్‌ఆర్.కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై శబ్ద కాలుష్యం ఫిర్యాదు



ట్విట్టర్‌లో ఫిర్యాదు

కాశిబుగ్గ: శబ్ద కాలుష్యం విషయమై బీజేపీ నాయకులు ఎమ్మెల్యే నరేందర్‌పై సీపీకి ఫిర్యాదు చేశారు. గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ ఓ సిటీ మైదానంలో ఆదివారం రాత్రి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, డీజే మోతలతో పరిసర ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు.. వారిపై చర్య తీసుకోవాలని సోమవారం ట్విట్టర్ ద్వారా వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మంతెన అమరీష్ తెలిపారు. సామాన్యుల పెళ్లి వేడుకల సందర్భంగా డీజే ఏర్పాటు చేస్తే అడ్డుకునే పోలీసులు ఇలాంటి వాటికి ఎలా అనుమతి ఇస్తున్నారో తెలియజేయాలని కోరారు.

కేయూ హాస్టల్ నుంచి విద్యార్థి అదృశ్యం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈమేరకు అతడి తల్లిదండ్రులు కేయూ పీఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసుల తెలిపారు. నల్గొండకు చెందిన బి.అనిల్ కాకతీయ యూనివర్సిటీలో ఎంఎస్సీ(మ్యాథ్స్) ఫైనలియర్ చదువుతూ.. కేయూ అంబేడ్కర్ హాస్టల్‌లో ఉంటున్నాడు. అనిల్‌తో పాటు మరో ఇద్దరు ఇదే హాస్టల్‌లో ఉంటున్నారు.. ఈనెల 21న అనిల్ హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడు. కేసు విచారణ సందర్భంగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి.హాస్టల్‌లో ఉంటున్న సహా విద్యార్థికి సంబంధించిన ఏటీఎం పిన్ నంబర్‌ను తెలుసుకున్న అనిల్ సుమారు రూ.3లక్షలు డ్రా చేసుకుని పారిపోయినట్లు పోలీసుల విచారణలో తేలింది. సహా విద్యార్థి కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యూ-విన్ పోర్టల్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ

గీసుకొండ: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి సంబంధించి యూ-విన్ పోర్టల్‌పై వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించిన మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సంబంధిత సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరు జిల్లాల డీఎంహెచ్‌ఓలు డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ సాంబశివరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్, డాక్టర్ గీతాలక్ష్మిలు పోర్టల్ గురించి శిక్షణలో అవగాహన కలిగించారు. గర్భిణులు, పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకా వివరాల యూ-పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటెన్సిఫైడ్ ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా ఆగస్టు 7న పోర్టల్ అమలులోకి వస్తుందన్నారు.

పెగడపల్లిలో వివాహిత ఆత్మహత్య

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన గంధ్రాతి అరుణ కుమారుడు గురువర్దన్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి అరుణ మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి భర్త గంధ్రాతి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

చిట్టీలు వేసి నష్టపోయాం..

- మోసగించిన వ్యక్తికి చెందిన భూమి అప్పగించి న్యాయం చేయాలి
- పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

సంగెం: పొదుపు సంఘం, చిట్టీల పేరుతో సుమారు 500 మందిని మోసం చేసి సుమారు రూ.1.50కోట్లతో ఉడాయించిన వ్యక్తికి సంబంధించి భూమిని తమకు అప్పగించాలని మహిళలు వేడుకుంటున్నారు. వరంగల్ నగరంలోని అబ్బనికుంటకు చెందిన వేములపల్లి సంపత్.. 'వెంకటలక్ష్మి పొదుపు సంఘం' పేరుతో సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన సుమారు 500 మంది మహిళల వద్ద నెలనెలా పొదుపుతో పాటు చిట్టీలు నిర్వహించాడు. అనంతరం ఏడ్లళ్ల క్రితం సుమారు రూ 1.50లతో ఉడాయించాడు. అతడికి సంబంధించి గ్రామంలో 5 గుంటల భూమి ఉంది. ఆ భూమిని గ్రామానికి చెందిన సమ్మయ్య అక్రమంగా వినియోగించుకుంటున్నాడు. దీనిపై విచారణ చేపట్టి ఆ భూమిని పొదుపు, చిట్టీలు వేసి నష్టపోయిన తమకు అప్పగించాలని వారు వేడుకుంటున్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్ రావు, ఎస్సై భరత్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రం గీత, బి.పద్మ, సరస్వతి, విజయ, అరుణ, భాగ్యమ్మ, మణమ్మ సుభద్ర తదితర పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సర్కారును బొంద పెట్టడం ఖాయం

- బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



హనుమకొండ : ధర్నాలో మాట్లాడుతున్న ఈటల, పాల్గొన్న నాయకులు

హన్మకొండ/వరంగల్: పేద ప్రజలకు సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట, పోచమ్మమైదాన్ జంక్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టియ్యలేని చేతకాని ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయంలో వేల కోట్లతో కట్టిన రాజీవ్ గృహకల్ప ఇళ్లే ఇంత వరకు ఎవరికీ ఇవ్వలేదని.. దీనిని బట్టి చూస్తే పేద వాళ్లపై ఆయనకు ఎంత మమకారం ఉందో అర్థమవుతోందని అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, పేదలు సంపాదిస్తున్న కూలీ బార్లకే పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వాడ వాడకు బెల్ట్ షాపులే రాష్ట్ర అభివృద్ధా అని నిలదీశారు. సీఎం కేసీఆర్ కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని, ఇంట్లో ఇద్దరు దంపతులకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, మొలుగురి భిక్షపతి, వన్నాల శ్రీరాములు, చాడ శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ రెడ్డి, గురుమూర్తి శివకుమార్, పేసరు విజయచందర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టాస్క్‌ఫోర్స్' అదుపులో భూకబ్జాదారులు..!

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భూకబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత భూకబ్జాదారులపై ఉక్కుపాదాం మోపడంతో వందల సంఖ్యలో పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో అక్రమంగా భూకబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని విచారిస్తున్నట్లు సమాచారం.